క్లుప్తంగా

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కొడంగల్: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని రుద్రారం గ్రామస్తులు, విఫర్‌యూ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. స్థానిక రైతు వేదికలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు, విద్యావంతులు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం వలన ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు సిద్ధార్థ రెడ్డి, నవీన్ గౌడ్, మాజీ సర్పంచు సాయిలు, టీఆర్ఎస్ నేతలు వెంకటయ్య గౌడ్, గోపాల్ రెడ్డి, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జీపీకి గడ్డికోత యంత్రం

ఎంపీడీఓ శైలజారెడ్డి



యంత్రం పని తీరును చూపిస్తున్న టెక్నీషియన్

మోమిన్‌పేట: ప్రతి గ్రామ పంచాయతీకి గడ్డికోత యంత్రాన్ని సరఫరా చేస్తున్నామని ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గడ్డికోత యంత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ యంత్రాల ద్వారా మొక్కల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించాలని సూచించారు. అనంతరం యంత్రాల పనితీరును టెక్నీషియన్ ద్వారా వివరించారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌కు సన్మానం



ప్రకాశ్‌ను సన్మానిస్తున్న ముదిరాజులు

కొడంగల్: శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను ముదిరాజ్ సంఘం నియోజకవర్గ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కొడంగల్ అధ్యక్షుడు నర్సింహులు, యువజన విభాగం అధ్యక్షుడు బాలరాజ్, తిరుపతయ్య, ఆశన్న, ఆంజనేయులు, మల్లేశ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో పలువురి చేరిక



బీఎస్పీలో చేరిన యువకులు

తాండూరు టౌన్: యువత బహుజన సమాజ్ పార్టీ వైపు మొగ్గుచూపుతుందని ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం కొత్లాపూర్, బాస్పల్లి, హన్మాపూర్ తదితర గ్రామాల నుంచి పలువురు యువకులు ఆయన సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ బహుజన రాజ్య స్థాపనలో భాగంగా పలువురు బీఎస్పీలో చేరడం అభినందనీయమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పొలానికి వెళ్లేందుకు రోడ్డు వేయించండి..



జెడ్పీటీసీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దోమ: తమ పొలాలకు వెళ్లే రోడ్డును మరమ్మతు చేయించి, కొత్తగా మెటల్ రోడ్డును నిర్మించేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు జెడ్పీటీసీ నాగిరెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం బొంపల్లి గ్రామానికి చెందిన బషీర్, చంద్రయ్య, దోమ నాగయ్య, బ్యాగరి నరేశ్, కుర్వ ఆంజనేయులు అనే రైతులు పరిగి పట్టణంలోని జెడ్పీటీసీ నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా తమ పొలాలకు వెళ్లాలంటే పానాది ఒక్కటే దిక్కవుతుందని, పానాదిలో వెళ్లాలంటే తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందారు. వర్షాలు కురిస్తే పానాది నిండుగా ప్రవహిస్తుంటుందని, పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని వాపోయారు. వెంటనే మట్టి రోడ్డును వేయించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రజలకోసమే ప్రజావాణి

- ప్రతి భూ సమస్య ఫిర్యాదును స్వీకరిస్తాం
- సరైన ఆధారాలతో దరఖాస్తు చేయండి
- సమస్యపై పూర్తి అవగాహనతో ఉండాలి
- ప్రజావాణిలో తహసీల్దార్ల వెల్లడి



తాండూరు రూరల్: ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నప్పల నాయుడు

తాండూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు అన్నారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావాణి నిర్వహిస్తామని వెల్లడించారు. నేడు (సోమవారం) నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

తగిన ఆధారాలతో..

మోమిన్‌పేట: భూ సమస్యలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును స్వీకరిస్తామని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రైతుల నుంచి పలు ఫిర్యాదులను ఆయన స్వీకరించి మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కొరకు రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదునైనా స్వీకరిస్తామని, కాని తగిన ఆధారాలను ఫిర్యాదు పత్రానికి జతపర్చాలని చెప్పారు. సమస్యలను చెప్పే ముందు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా మీ సేవలో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, ధరణి సమస్యలను మీ సేవలో దరఖాస్తు చేసిన ఆధారాలను తహసీల్ కార్యాలయంలో అందజేయాలని వెల్లడించారు.

ధరణి సమస్యల పరిష్కారానికి కృషి

దోమ: ధరణి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని రైతులు అధికారులకు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విశేష స్పందన

పెద్దేముల్: ప్రజావాణికి మంచి స్పందన లభిస్తుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఒక్క దరఖాస్తు వచ్చినట్లు ఆయన చెప్పారు. రుద్రారం గ్రామానికి చెందిన వెంకటయ్య తన వ్యవసాయ భూమి నాన్ అగ్రికల్చర్ నుంచి అగ్రికల్చర్‌గా మార్చాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

అనంతగిరి: వికారాబాద్ మండల తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 42 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ వహీదా ఖాతూం తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు మిగతా వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆమె తెలిపారు.



మోమిన్‌పేటలో.. తహసీల్దార్ కిరణ్‌కుమార్



దోమలో.. డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్



పెద్దేముల్‌లో.. ఆర్ఐ రాజిరెడ్డి



అనంతగిరిలో.. తహసీల్దార్ వహీదా ఖాతూం

అంధత్వ నివారణకు కంటివెలుగు



కంటి పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ కవిత

దోమ: అంధత్వాన్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సర్పంచ్ కవిత అన్నారు. సోమవారం బడేంపల్లి గ్రామంలో మండల వైద్యాధికారులు ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా కంటి సమస్యలతో బాధపడుతుంటారని, దాన్ని దూరం చేసేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం ఎంతో మేలు చేకూరుస్తుందని తెలిపారు. కావున ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు లగచర్లలో..

బొంరాస్‌పేట: దుద్యాల మండల పరిధిలోని లగచర్లలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సద్గురు రామబ్రహ్మానందస్వామి తెలిపారు. సద్గురు రాములు ఆశీస్సులతో గీతా జ్ఞాన గురుభక్త మండలి ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఎమ్మెస్ రెడ్డి లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అలాగే శిబిరంలో డాక్టర్ రవీంద్రయాదవ్, డాక్టర్ వెంకటేశ్వర్లు సాధారణ వైద్య పరీక్షలు, చికిత్స చేయనున్నట్లు చెప్పారు. ఈ శిబిరాన్ని కంటి సమస్య ఉన్నవారు, సాధారణ అనారోగ్య సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

దోమ: లక్ష్యం చేరుకునేందుకు విద్యార్థులు విద్యపై దృష్టి సారించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఎంఈఓ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. మెరుగైన ఫలితాల సాధన కోసం శ్రద్ధ చూపాలని చెప్పారు. అనంతరం హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, వారికి మెనూతో పాటు నాణ్యతతో కూడిన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ మంగమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బాలను తొలగించొద్దు.. వీధిన పడతాం



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చిరువ్యాపారులు

పెద్దేముల్: డబ్బాలను తొలగిస్తే వీధిన పడతామని, వాటిని తొలగించకుండా చూడాలని మంబాపూర్ చిరువ్యాపారులు సోమవారం ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందచేశారు. ఇరవై ఏళ్లుగా డబ్బాలు వేసుకొని ఉపాధి పొందుతున్నామని, ఇప్పుడు వాటిని తొలగిస్తే జీవనోపాధి కోల్పోతామని ఎమ్మెల్యేకు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వ్యాపారులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్ శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి, చిరువ్యాపారులు తదితరులు ఉన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

దౌల్తాబాద్: మహిళలు స్వయం సహాయక సంఘాల్లో తీసుకున్న బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను సకాలంలో చెల్లిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఏపీఎం సాయన్న, స్త్రీనిధి మేనేజర్ సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో సంఘాల ఏర్పాటు, బలోపేతం, రుణాల చెల్లింపు తదతర అంశాలపై మహిళలకు వివరించారు. ఈ క్రమంలో స్థానిక వీఓఏ మహిళా సంఘాలకు రుణాలు ఇప్పిస్తానని కొంతమంది సభ్యుల వద్ద డబ్బులు తీసుకున్నారని సమావేశంలో తెలిపారు. దీనిపై విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సీసీ బాల్‌రాజు తదితరులున్నారు.

రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలి

అనంతగిరి: సాగు చేస్తున్న భూమిపై రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులుమద్ది గ్రామానికి చెందిన రెండు వందల కుటుంబాలు 100 ఎకరాల్లో రెండు తరాలుగా సాగు చేస్తూ జీవిస్తున్నారన్నారని తెలిపారు. మూడుసార్లు ఎవెన్యూ, ఫారెస్టు జాయింట్ సర్వేచేసి పట్టాలు ఇస్తామన్నారని చెప్పారు. కానీ ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని, వెంటనే కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

హమాలీ కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మల్లేశం డిమాండ్ చేశారు. వికారాబాద్ పట్టణంలో గత 30 సంవత్సరాలుగా హమాలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని, పట్టణంలో వారికి అనువైన స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్లు అందజేస్తున్న సీహెచ్ఓ చంద్రప్రకాశ్

కుల్కచర్ల: గర్భిణులు ప్రభుత్వం అందజేస్తున్న న్యూట్రిషియన్ కిట్‌లను వినియోగించుకోవాలని కుల్కచర్ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 20మంది గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషియన్ కిట్‌లను అందజేసి మాట్లాడారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పోషకాహార కిట్లను పంపిణీ చేస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదు



అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కుల్కచర్ల: రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కుల్కచర్ల ఎంపీడీఓ కరీం అన్నారు. సోమవారం పీరంపల్లి గ్రామ పరిధిలోని పరిగి-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవెన్యూ ప్లాంటేషన్ పట్ల పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్, స్థానిక నేతలు సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా ఉత్సవాలు



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలు ముజాహిద్‌పూర్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. సర్పంచ్ లక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని చెప్పారు. స్థానిక నేతలు చంద్రభూపాల్, కృష్ణయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ప్రతిపక్షాలకేనా?



రాఘవపూర్‌లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి జన్మదిన వేడుకల హోర్డింగ్

పరిగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో హోర్డింగులు, ఫ్లెక్సీలను అధికారులు ఇప్పటికే తొలగించారు. అయితే పరిగి మండలంలో మాత్రం అధికార పార్టీకి చెందిన నేతల హోర్డింగులు తొలగించకపోవడంతో ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడి అధికారులు ఎన్నికల కోడ్ నిబంధనలు పట్టించుకోరా అంటూ ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని రాఘవపూర్‌లో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి జన్మదిన వేడుకలకు సంబంధించిన హోర్డింగ్‌ను తొలగించకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ కేవలం ప్రతిపక్ష పార్టీలకే వర్తిస్తుందా? అధికార పార్టీ బీఆర్ఎస్‌కు వర్తించదా? అని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు ఎన్నికల కోడ్ అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య పనులకు ప్రథమ ప్రాధాన్యత



రోడ్లను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు, సిబ్బంది

కుల్కచర్ల: పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ సౌమ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తులు బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయకుండా గ్రామపంచాయతీ వాహనాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

భూకైలాస్‌లో ముగిసిన బ్రహ్మోత్సవాలు



అగ్నిగుండంలో నడుస్తున్న ఆలయ వ్యవస్థాపకులు వాసు పవార్ నాయక్

తాండూరు రూరల్: అంతారం తండాలో ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం భూకైలాస్‌లో బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. బుధవారం నుంచి ప్రారంభమైన ఉత్సవాలు శివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎక్కడలేని విధంగా నీటి మార్గం ద్వారా వెళ్లి శివుడిని భక్తులు దర్శించుకుంటారు. సోమవారం తెల్లవారు జామున అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపకులు శంకర్ నాయక్‌పవార్, వాసుపవార్ నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా పూలంగిసేవ

కొడంగల్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకొని ఉదయం విశేష పూల అలంకరణతో ఆలయ అర్చకులు స్వామివారికి పూలంగి సేవ చేశారు. అనంతరం అభిషేకం, అలంకరణ, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు తమ గోత్ర నామాలతో స్వామివారికి అర్చనలు చేస్తూ.. దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇసుక సమస్య తీరింది!

- సర్కారు పనులకు గ్రీన్ సిగ్నల్
- మరో రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి
- హర్షంవ్యక్తం చేస్తున్న స్థానికులు, గుత్తేదారులు



యాలాల: ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతులు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇదే విషయమై కలెక్టర్ నారాయణరెడ్డి ఇప్పటికే యాలాల తహసీల్దార్ గోవిందమ్మకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో మండలంలో ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతులు జారీ చేసేవారు. కాగా మూడేళ్ల క్రితం ఈ అనుమతులను నిలిపివేస్తూ నాటి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనుమతుల పేరిట ఇసుక పక్కదారి పడుతుందని గ్రహించి అప్పట్లో బ్రేక్ వేశారు. ఇక నాటి నుంచి ఇసుక కోసం ప్రభుత్వ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లతో పాటు సామాన్యులు పడరాని పాట్లు పడుతున్నారు. కాగా ఇటీవల మండలానికి రూ.2 కోట్ల మేర ఉపాధిహామీ నిధులు మంజూరయ్యాయి. వీటితో 37 పంచాయతీల్లో శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాలతో పాటు కొత్త భవనాల నిర్మాణానికి గాను ఒక్కో పంచాయతీకి రూ.25 లక్షలు మంజూరయ్యాయి. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఇసుక కొరత విషయమై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి ఇసుక అనుమతులపై చర్చించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతులు కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇసుక అనుమతుల ప్రక్రియకు గాను విధివిధానాలు, ఆంక్షలు, తరలింపు ప్రక్రియ, డీడీల చెల్లింపు లాంటి విషయాలపై నివేదికను రెవెన్యూ సిబ్బంది తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్, నాగసముందర్, రాస్నం, అగ్గనూరు, బెన్నూరు, కోకట్, యాలాల, గోవిందరావుపేట, దేవనూరు, సంగెంకుర్దు, అడాల్‌పూర్ తదితర గ్రామాల పరిధిలోని కాగ్నా, కాక్రవేణి నది నుంచి ఇసుక అనుమతులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇసుక తరలించేందుకు ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వనున్నారు. ఒకటి రెండు రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇసుక సమస్య గట్టెక్కుతుండడంతో స్థానిక ప్రజలు, గుత్తేదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.